తెలంగాణకు శని, శాపం రేవంత్

- ముఖ్యమంత్రి రేవంత్‌వి పచ్చి అబద్ధాలు.. ప్రగల్భాలు
- మరోసారి సంకుచిత బుద్ధిని చాటుకున్న సీఎం
- కేసీఆర్‌పై దూషణలకు దిగడం అత్యంత దుర్మార్గం
- తెలంగాణను తెచ్చిన నేతను ఉరితీయాలంటవా?
- రేవంత్‌రెడ్డీ.. నీది నోరా? మోరా? : హరీశ్ ధ్వజం

హైదరాబాద్ జూన్ 24 (నమస్తేతెలంగాణ): రైతు నేస్తం సంబురాల పేరిట సచివాలయం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి సంకుచితబుద్ధిని చాటుకున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. సహనం కోల్పోయి కేసీఆర్‌పై దూషణలకు దిగడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చి రైతుల ఖాతాల్లో రూ.80 వేల కోట్ల రైతుబంధు జమ చేసిన నాయకుడిని ఉరి తీయాలని మాట్లాడటం రేవంత్ కుసంస్కారానికి నిదర్శనమని నిప్పులు చెరిగారు. అధికారిక కార్యక్రమమనే సోయిని కూడా మరిచి కేసీఆర్‌పై సంస్కారహీనంగా మాట్లాడి రేవంత్ మరోసారి చిల్లర బుద్ధిని చాటుకున్నారని మంగళవారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణకు శనిలా..శాపంలా మారిన రేవంత్‌రెడ్డి ఉల్టా చోర్ కొత్వాల్‌కో డాంటే అనే చందంగా నోటికొచ్చిన అబద్ధాలు. ఇష్టారీతిన ప్రగల్భాలు పలికారని ధ్వజమెత్తారు. పదేండ్ల అద్భుతమైన కేసీఆర్ పాలనను తక్కువ చేసి చూపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఫైర్ అయ్యారు. అడ్డమైన హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్.. వాటిని నెరవేర్చడం చేతగాక, ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకత తట్టుకొలేక నిత్యం బూతులతో నెట్టుకు రావాలని చూస్తున్నాడని, కానీ ఇది కుదరదని హెచ్చరించారు. స్థానిక ఎన్నికల్లో గెలుపుపై భరోసా లేకనే విధిలేని పరిస్థితుల్లో రైతు భరోసా వేసి తానే చాంపియన్ అనే భ్రమలో ఉన్నారని ఎద్దేవా చేశారు. రేవంత్‌ను రైతులు నమ్మే పరిస్థితి లేదని స్పష్టంచేశారు.

> తెలంగాణను తెచ్చి.. రైతుబంధు పేరిట రూ.80 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిన నాయకుడిని ఉరి తీయాలని మాట్లాడటం రేవంత్ కుసంస్కారానికి నిదర్శనం. అధికారిక కార్యక్రమమనే సోయి మరిచి కేసీఆర్‌పై సంస్కారహీనంగా మాట్లాడి మరోసారి తన చిల్లర బుద్ధిని బయటపెట్టుకున్నరు. తెలంగాణకు శనిలా..శాపంలా మారిన రేవంత్‌రెడ్డి ఉల్టా చోర్ కొత్వాల్‌కో డాంటే అన్న చందంగా నోటికొచ్చిన అబద్ధాలు.. ఇష్టారీతిన ప్రగల్భాలు పలికింద్రు. –హరీశ్

నిన్ను తెలంగాణ సమాజం క్షమించదు

దేశంలోనే తొలిసారిగా రైతులకు పెట్టుబడి సాయం అందించాలని ఆలోచించి రైతుబంధును తెచ్చి రూ.80 వేల కోట్లను అన్నదాతల ఖాతాల్లో జమ చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని హరీశ్ గుర్తుచేశారు. సాగును పండుగలా తీర్చిదిద్దిన కేసీఆర్‌ను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి ఉన్మాదంతో ఉరి తీయాలని మాట్లాడటం బాధాకరమని వాపోయారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ సమాజం, చరిత్ర క్షమించబోదని హెచ్చరించారు. లక్ష కోట్ల ఖర్చే లేని కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని రేవంత్ చెప్పడం విని ప్రపంచమే నివ్వెరపోతున్నదని పేర్కొన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ఎడారిలా మారితే ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం నంబర్‌వన్‌గా ఎలా నిలిచిందని ప్రశ్నించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేసి 44 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చింది నిజం కాదా? అని ప్రశ్నించారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను నిర్మించి నాలుగు వేల కోట్లతో ఆరున్నర ఎకరాలకు నీళ్లిచ్చిన ఘనత కేసీఆర్ సర్కారుకే దక్కిందని తెలిపారు. 'రేవంత్‌రెడ్డీ.. ఈ విషయం నీకు తెలియకుంటే ఇంగేషన్ శాఖలోని అధికారులను అడిగి తెలుసుకో' అని దెప్పిపొడిచారు. సీఎం స్థానంలో ఉండి, సభానాయకుడిగా వ్యవహరిస్తూ అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడం.. అసెంబ్లీ వ్యవహారాల గురించి ఆయనకు తెలియకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.

> పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ఎడారిలా మారితే ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం నంబర్ వన్‌గా ఎట్ల నిలిచింది? నువ్వు వచ్చిన తర్వాత ఒక్క చెక్‌డ్యామ్ కట్టకపోతివి.. ఒక్క కాలువ తవ్వకపోతివి.. మరి 3 కోట్ల టన్నుల ధాన్యం ఎట్ల ఉత్తత్తి జరిగింది రేవంత్‌రెడ్డీ? –హరీశ్

> సీఎం స్థానంలో ఉండి, సభానాయకుడిగా వ్యవహరిస్తూ అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడం.. నీకు అసెంబ్లీ వ్యవహారాల గురించి తెలియకపోవడం సిగ్గుచేటు. బనచర్ల ప్రాజెక్టుపై వేదిక ఏదైనా చర్చించేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉన్నది. చర్చించడమే కాదు.. నీ ద్రోహాన్ని, నువ్వు చేస్తున్న మోసాన్ని బట్టబయలు చేస్తం..–హరీశ్

ఏం ఉద్ధరించారని సంబురాలు?

హైదరాబాద్, జూన్ 24 (నమస్తేతెలంగాణ): స్థానిక ఎన్నికల్లో ఓట్ల కోసమే రైతు భరోసా పేరిట రేవంత్ సర్కారు డ్రామాలు ఆడుతున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. నాడు నాట్లకు నాట్లకు మధ్య రైతుబంధు పడితే నేడు ఓట్లకు ఓట్లకు మధ్య రైతుభరోసా పడుతున్నదని మంగళవారం ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. 'రైతులకు ఏం చేశావని సంబురాలు చేసుకుంటున్నవ్ రేవంత్‌రెడ్డీ? రెండు సీజన్ల రైతుభరోసా ఎగ్గొట్టినందుకా? కౌలు రైతులకు రైతుభరోసా ఇవ్వనందుకా? రైతు కూలీలందరికీ ఆత్మీయ భరోసా ఇవ్వనందుకా? అన్ని పంటలకు బోనస్ అని చెప్పి సన్నాలకే పరిమితం చేసినందుకా? రూ. 1200 కోట్ల బోనస్ నగదు చెల్లించనందుకా? ప్రీమియం కట్టకుండా రైతుబీమాను ప్రశ్నార్థకం చేసినందుకా? పంటల బీమా హామీని అటకెక్కించినందుకా? అన్నం పెట్టే అన్నదాతలపై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేసినందుకా? లగచర్ల, రాజోలి రైతుల చేతులకు బేడీలు వేయించినందుకా? ఏడాదిన్నర పాలనలో ఒక్క చెరువు నింపకుండా, చెక్ డ్యాం కట్టకుండా ఎకరాకు కూడా నీళ్లివ్వనందుకా? ధాన్యం కొనుగొళ్లు చేయకుండా అన్నదాతను ఇబ్బందిపెట్టినందుకా? జనుము, జీలుగ విత్తనాల ధరలు పెంచి సకాలంలో అందించనందుకా? వరంగల్ డిక్లరేషన్‌ను పక్కన పెట్టినందుకా? మీ దుర్మార్గపు పాలనలో 511 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నందుకా?' అంటూ ప్రశ్నాస్త్రాలు సంధించారు.

నాడు సుభిక్షం..నేడు సంక్షోభం..

బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ముందు చూపుతో అమలు చేసిన రైతుబంధు, రైతు బీమా, 24 గంటల నిరంతర కరెంట్, పంటల కొనుగోలుతో నాడు రైతాంగం సుభిక్షంగా ఉండేదని హరీశ్ గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ గద్దెనెక్కిన తర్వాత అవగాహనలేమి, బాధ్యతారాహిత్యంతో తీసుకున్న చర్యల ఫలితంగా సాగు సంక్షోభంలో చిక్కుకున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. కేసీఆర్ హయాంలో తెచ్చిన పథకాలు అందకపోవడంతో పంట పొలాలు, వడ్ల కుప్పలపైనే రైతులు ప్రాణాలు విడుస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్‌ది రైతు సంక్షేమ ప్రభుత్వమైతే, కాంగ్రెస్‌ది రైతు సంక్షోభ ప్రభుత్వమని ధ్వజమెత్తారు. 'స్థానిక ఎన్నికల ముందు మీరు చేస్తున్న ఓట్ల జిమ్మిక్కులను రైతులేవరూ నమ్మబోరు.. ఇప్పటికైనా మాటలు కట్టిపెట్టి ఎన్నికల హామీలపై దృష్టి పెట్టండి' అని డిమాండ్ చేశారు.

'నదిపై ప్రాజెక్టులు నిర్మించనందుకే 299 టీఎంసీలకు తాత్కాలిక ఒప్పందం చేసుకున్నామని ఎన్నిసార్లు చెప్పినా మీకు ఒంట బట్టకపోవడం..పని గట్టుకొని బురద జల్లడం మానుకోకపోవడం..అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం' అని ఖండించారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయించని దద్దమ్మ రేవంత్‌రెడ్డి అని మండిపడ్డారు. ఇంతటితో ఆగకుండా ఇప్పుడు అన్నారం, సుందిళ్ల కూడా కూలిపోయాయని తప్పుడు ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. పిల్లి శాపనార్థాలకు ఉట్లు తెగిపడవనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

> రేవంత్‌రెడ్డీ..నీది నోరా..మోరా? మహిళలకు వడ్డీ లేని రుణాలపై అబద్ధాలు.. ఉద్యోగ నియామకాలపై అబద్ధాలు.. అన్నీ తప్పుడు మాటలు మాట్లాడుతున్న నిన్ను వదిలిపెట్టేది లేదు. హామీలు అమలు చేసేదాకా నీ వెంట పడుతూనే ఉంటం. –హరీశ్

- రైతునేస్తం సంబురాల్లో ఖాళీ కుర్చీలు

రైతు భరోసా డబ్బులను రైతుల అకౌంట్లోకి వేసిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రైతునేస్తం సంబురాల కార్యక్రమాన్ని అన్ని రైతు వేదికలలో మంగళవారం నిర్వహించింది. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం తిమ్మాపూర్ రైతు వేదికలో మధ్యాహ్నం 3 గంటలకు సంబురాల కార్యక్రమం ప్రారంభమవుతుందని రైతులకు మండల వ్యవసాయ అధికారులు మెసేజ్‌లు పెట్టారు. సాయంత్రం 5 గంటలు దాటినా రైతువేదికల్లో రైతులు కన్పించలేదు. దీంతో అధికారులు రైతుల కోసం వేసి చూడాల్సి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం ప్రారంభించే సమయానికి 10 మంది రైతులతో కార్యక్రమాన్ని మమ అనిపించారు. –కొత్తూరు

ఉద్యోగ నోటిఫికేషన్లు వద్దని ధర్నాలు చేస్తున్నరు!

- ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం
- గోదావరి- బనకచర్లపై అసెంబ్లీలో చర్చ పెడదాం
- రైతుభరోసా విజయోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రేవంత్‌రెడ్డినే మళ్లీ గెలిపించాలి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, జూన్ 24(నమస్తే తెలంగాణ): గతంలో యువత ఉద్యోగాల కోసం ధర్నాలు చేస్తే.. కాంగ్రెస్ సర్కారులో నోటిఫికేషన్లు వద్దని ధర్నాలు చేసే పరిస్థితి వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఎక్కువ నోటిఫికేషన్లు ఇస్తుండటంతో తాము అన్ని ఉద్యోగాలకు ఒకేసారి చదవలేకపోతున్నామని, నోటిఫికేషన్లు ఆపాలంటూ ధర్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. మంగళవారం సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద రైతుభరోసా విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో తమ మొదటి ప్రాధాన్యం రైతులకేనని స్పష్టంచేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కష్టమైనా సరే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేసినట్టు తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలన.. 18 నెలల కాంగ్రెస్ పాలన ఏవిధంగా ఉన్నదో బేరీజు వేయాలని, అంతటా చర్చ పెట్టాలని ప్రజలను కోరారు. గోదావరి-బనకచర్లపై అబద్ధాలు చెప్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారంటూ బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. గోదావరి-బనకచర్లపై అసెంబ్లీలో చర్చ పెడదామని పేర్కొన్నారు. కాంగ్రెస్ తప్పు చేసినట్టు ఒక్క కాగితం చూపించినా తాను, మంత్రి ఉత్తమ్‌కుమార్ దేనికైనా సిద్ధమని పేర్కొన్నారు. 'బనకచర్లపై ప్రజా ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తారా?తాను చంద్రబాబుతో అంటకాగాలనుకుంటే అక్కడే ఉండేవాడిని కదా? రాజీవ్‌గాంధీ ఆశీర్వాదం తీసుకునేందుకు ఇక్కడికి ఎందుకు వచ్చేవాడిని, కాంగ్రెస్‌లో ఎందుకు చేరేవాడిని?' అని ప్రశ్నించారు. త్వరలోనే రాజీవ్ యువ వికాసం పథకం అమలవుతుందని సీఎం వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్యాన్సర్ వ్యాధిలా ఉన్నదని, దివాలా రాష్ట్రంగా మారిందని మరోసారి చెప్పారు.

రేవంత్‌నే మళ్లీ గెలిపించాలి: మంత్రి తుమ్మల

ఇచ్చిన మాట ప్రకారం తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతుభరోసా పంపిణీ పూర్తిచేసినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తాము ఎన్నికల్లో రూ.2 లక్షల లోపు ఉన్న రైతులకు రుణమాఫీ చేస్తామని మాటిచ్చామని, ఆ మేరకు చేశామని పేర్కొన్నారు. ఐదేండ్లలో అన్నీ హామీలు అమలుచేస్తామని, మరోసారి రేవంత్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

15 ఎకరాలకుపై రైతులకు భరోసా జమ

రైతుభరోసా పంపిణీలో భాగంగా మంగళవారం 15 ఎకరాలకుపైగల రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసినట్టు మంత్రి తుమ్మల వెల్లడించారు. ఎకరానికి రూ.6వేల చొప్పున రూ.459.47 కోట్లు జమ చేశామని తెలిపారు. ఇప్పటివరకు వానకాలం రైతుభరోసా కింద 69.4 లక్షల మంది రైతులకు సంబంధించిన 1.46 కోట్ల ఎకరాలకు రూ.8,744.13 కోట్ల నిధులు జమ చేసినట్టు వెల్లడించారు.

రైతుల్ని నిండా ముంచి సంబురాలా?

- 2 లక్షల మాఫీ ఎగ్గొట్టినందుకా!
- 500మంది రైతులు బలైనందుకా?
- రైతుభరోసాది ఎన్నికల స్టంటే
- రైతును రాజుగా చేయాలన్నది మాజీ సీఎం కేసీఆర్ సంకల్పం
- మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): రైతులను నిండా ముంచి మోసం చేసినందుకు సంబురాలు చేసుకోవాలా? అని సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో మండిపడ్డారు. నేడు రాష్ట్రంలో సగం మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఎగ్గొట్టినందుకు సంబురాలు చేసుకోవాలా? ఏడాదిన్నర పాలనలో 500 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నందుకు చేసుకోవాలా? అని మంగళవారం ఒక ప్రకటనలో ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతుభరోసా వేసి సంబరాలు చేసుకోవాలనడాన్ని రైతులు ఎన్నికల స్టంట్‌గానే చూస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతును రాజుగా చేయాలన్న సంకల్పంతో నాడు కేసీఆర్ పెట్టుబడి సాయాన్ని ప్రారంభించారని ఆయన గుర్తుచేశారు.

నాలుగు విడతలు ఎగ్గొట్టినందుకా?:

రైతుభరోసా నాలుగు విడతలు ఎగ్గొట్టినందుకు సంబరాలు చేసుకోవాలా? అని బీఆర్ఎస్ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎకరాకు రూ.15 వేలు రైతు భరోసా ఇస్తామని చెప్పి మోసం చేసినందుకా? రూ.2 లక్షల రుణమాఫీ ఎగ్గొట్టినందుకు సంబరాలు చేసుకోవాలా? అని మండిపడ్డారు. లగచర్ల, పెద్ద ధన్వాడ రైతులకు బేడీలు వేసినందుకు సంబరాలు చేసుకోవాలా? అని ఎద్దేవా చేశారు. నాలుగుసార్లు రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతు పండగ పేరుతో సంబురాలు చేయాలనడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఐదు దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో కేసీఆర్‌లాగా ఒక్క పథకం అయినా ప్రవేశపెట్టారా? అని పేర్కొన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం కోసగుంపులో ఆదివాసీ గిరిజనులను పరామర్శిస్తున్న తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్, పొడియం బాలరాజు, వట్టం సుభద్ర, ఆదివాసీ నేతలు

ప్రజాపాలనా.. రాక్షసపాలనా?

- ఆదివాసీ మహిళలపై దాడితో ఆదివాసీ మంత్రి, ఎమ్మెల్యేలు సిగ్గుతో తలదించుకోవాలి
- గిరిజన మహిళలకు రక్షణ కల్పించలేనివారు పదవులకు రాజీనామా చేయండి
- ఘటనపై జాతీయ ఎస్సీ, ఎస్టీ, మానవ హక్కుల కమిషన్‌కు త్వరలో ఫిర్యాదు చేస్తాం
- కోసగుంపును సందర్శించిన తుడుందెబ్బ రాష్ట్ర బృందం

బూర్గంపహాడ్, జూన్ 24 : రాష్ట్రంలో ప్రజాపాలన నడుస్తున్నదా? రాక్షస పాలన నడుస్తున్నదా? అని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్ ప్రశ్నించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం కోసగుంపులో ఇటీవల అటవీశాఖ అధికారుల దాడిలో గాయపడిన ఆదివాసీ గిరిజన మహిళలను మంగళవారం ఆయన ఏఈడబ్ల్యూసీఈఏ (ఆదివాసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ కల్చర్ అసోసియేషన్) రాష్ట్ర నేత పొడియం బాలరాజు, ఆధార్ సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాంబాబు, ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వట్టం సుభద్ర, నేతలతో కలిసి పరామర్శించి దాడికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు పోడు సాగుచేసుకుంటున్న గిరిజన ఆడబిడ్డల దుస్తులు చింపి, చేతులు, కాళ్లు లాగుతూ పాశవికంగా దాడికి తెగబడడం ఆటవికచర్యగా అభివర్ణించారు. 30 కుటుంబాలు 30 ఏళ్ల క్రితమే వచ్చి ఇక్కడ పోడు భూములు సాగు చేసుకుంటుంటే అటవీ అధికారులు ఇప్పుడు వెళ్లి దాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆదివాసీ మంత్రిగా ఉన్న సీతక్క, నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం, జిల్లాలోని ఆదివాసీ ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, ట్రైబల్ అడ్వైజరీ కమిటీకి బాధ్యత వహించే ప్రతి ఆదివాసీ ఎమ్మెల్యేలు సిగ్గుతో తలదించుకోవాల్సిన ఘటన ఇదని పేర్కొన్నారు. ఆదివాసీ మహిళలకు రక్షణ కల్పించలేని వారికి పదవులు ఎందుకని, వెంటనే అందరూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఘటన సంచలనం సృష్టిస్తే.. కనీసం మంత్రి, ఎమ్మెల్యే కోసగుంపును సందర్శించకపోవడం విచారకరమని తెలిపారు. ఈ ఘటనపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ప్రజాసంఘాలు, మానవ హక్కుల సంఘాలు, వివిధ పార్టీలు అడవి బిడ్డలకు అండగా నిలబడాలని కోరారు.

'స్థానిక' భయం.. తప్పకొన్న సీఎం!

మొదటిపేజీ తరువాయి...

లేదని, గ్రామాల్లో అభివృద్ధి పనులన్నీ నిలిచిపోయాయని, ఊర్లలో తిరిగే పరిస్థితి లేదని, ఎమ్మెల్యేలు తేల్చి చెప్పటంతో సీఎం రేవంత్ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ బాధ్యలను జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించారనే ప్రచారం జరుగుతున్నది. 'స్థానిక సంస్థల ఎన్నికల బాధ్యత అంతా ఇన్‌చార్జి మంత్రులదే! నిధులు, బాధ్యతలన్నీ మీ దగ్గరే ఉన్నయి. జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు దృష్టిపెట్టడం లేదు. ఇది సరికాదు. నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయండంటే ఎందుకు పట్టించుకోవడం లేదు? వెంటనే జిల్లాల్లో పదవులను భర్తీ చేయండి' అని సీఎం రేవంత్ చెప్పటంతో ఇన్‌చార్జి మంత్రులు కంగుతిన్నట్టు తెలిసింది. జిల్లాల్లో స్థానిక మంత్రులను కాదని, తాము ఏం చేయగలమని? మార్కెటింగ్ కమిటీ, టెంపుల్ కమిటీ ల్లాంటి చిన్న చిన్న నామినేటెడ్ పోస్టులనే వారు భర్తీ చేయనివ్వడం లేదని, ఎమ్మెల్యేలకు, మంత్రులకు పొసగడం లేదని మధ్యలో స్థానికేతరులం తలదూర్చి ఏం చేయగలమని ఇన్‌చార్జి మంత్రులు వాపోతున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

పట్టభద్రుల ఎన్నికల్లో భంగపాటు

ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం సిట్టింగ్ స్థానాన్ని కూడా గెలిపించుకోలేక కాంగ్రెస్ చతికిలపడిన విషయం తెలిసిందే! ఈ స్థానాన్ని మళ్లీ నిలుపుకొనేందుకు కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని పక్కన పెట్టి ఆర్థికంగా స్థితిమంతుడైన, విద్యా వ్యాపారి పూట్కూరి నరేందర్‌రెడ్డిని బరిలో నిలిపింది. ఏ ఒక్క ఓటునూ జారవిడుచుకోవద్దనే లక్ష్యంతో ఏడుగురు మంత్రులు, 23 మంది ఎమ్మెల్యేలను రంగంలోకి దింపింది. వీరు కాకుండా కార్పొరేషన్ చైర్మన్లు, యూత్ కాంగ్రెస్ నేతలు, టీపీసీసీ కార్యవర్గం, ఎన్ఎస్‌యూఐ నేతలను, పార్టీ కార్యకర్తలను మొత్తం కలిపి 14 వేల మందిని ఎమ్మెల్సీ నియోజకవర్గంలోకి చొప్పించారు. వీరితో పాటు గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్సీ ఎన్నకలకు ముఖ్యమంత్రి స్థాయిలో కరీంనగర్, నిజామాబాద్, మంచిర్యాలలో బహిరంగ సభలు పెట్టారు. చిట్ట చివరగా ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలు జరిగాయని, ఏం చేసినా కాంగ్రెస్ ఓటమిని ఆపలేకపోయారని పార్టీ వర్గాలే చర్చించుకుంటున్నాయి. 'ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం మంచి చేసిందని మీరు అనుకుంటేనే మాకు ఓటు వేయండి' అని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు నివ్వడం వల్లే పట్టభద్రులు కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించినట్టు తర్వాత సమీక్షల్లో బయటపడింది.

వ్యతిరేకత తప్పదన్న ఇంటెలిజెన్స్!

స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ఇదే పరిస్థితి పునరావృతమవుతుందని ఇంటెలిజెన్స్ వర్గాలు ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిక ఇచ్చినట్టు సమాచారం. కీలకమైన మహాలక్ష్మి పథకం అమలు చేయకపోవటంతో మహిళలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, హైడ్రా కూల్చివేతల కారణంగా పేదల్లో వ్యతిరేకత విపరీతంగా పెరిగిందని నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది. మరోవైపు గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం రూపాయి కూడా నిధులివ్వ లేదని, గ్రామాల్లో అభివృద్ధి పనులన్నీ నిలిచిపోయాయని, ఊర్లలో తిరిగే పరిస్థితి లేదని, ఈ పరిస్థితుల్లో ఏ ముఖం పెట్టుకుని ప్రజల్లోకి వెళ్లాలని సొంత పార్టీ ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేసినట్టు సమాచారం. అన్నివైపులా ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలోనే సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థల అభ్యర్థుల బాధ్యతను ఇన్‌చార్జి మంత్రుల మీదికి నెట్టేసినట్టు తెలిసింది.

రాబోయే రోజుల్లో సవాళ్లు

- కష్టపడే వారికి అవకాశాలు
- 'జూబ్లీహిల్స్' అభ్యర్థిని అధిష్ఠానం ప్రకటిస్తుంది
- నూతన పీసీసీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు నియామక పత్రాలు అందజేసిన సీఎం రేవంత్, మీనాక్షి నటరాజన్

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): రాబోయే రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అనేక సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని, అందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గాంధీ భవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ , డీలిమిటేషన్, రాజకీయ వ్యవహారాలు, పీసీసీ సలహా కమిటీల సమావేశాలు జరిగాయి. నూతనంగా నియామకమైన పీసీసీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులతో జరిగిన సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..పార్టీ కోసం పనిచేయని వాళ్లను ఎన్నికల ముందు బాధ్యతల నుంచి తప్పిస్తామని, పనిచేస్తే ప్రమోషన్ ఇస్తామని పేర్కొన్నారు.

మంత్రుల తీరుపై అసంతృప్తి

జిల్లాలపై ఇన్‌చార్జి మంత్రులు దృష్టిపెట్టడం లేదని సీఎం అసంతృప్తి వ్యక్తంచేశారు. వెంటనే జిల్లాల్లో పదవులు, మార్కెట్, దేవాలయ కమిటీల్లో నామినేటెడ్ పోస్టులు భర్తీచేయాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అభ్యర్థిని అధిష్ఠానం ప్రకటిస్తుందని తెలిపారు.

కష్టపడే వారికే అవకాశాలు: మీనాక్షి

పార్టీ కోసం కష్టపడే వారికి కమిటీల్లో, రాజకీయంగానూ అవకాశాలు కల్పిస్తామని మీనాక్షి నటరాజన్ హామీ ఇచ్చారు. పార్టీని గ్రామ, మండల, జిల్లా స్థాయిలో బలోపేతం చేయడానికి క్షేత్రస్థాయి సమీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అసంతృప్తితో కార్యకర్తలు: జగ్గారెడ్డి

కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కమిటీ సమావేశంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు.

జూలై 4న రాష్ట్రానికి ఖర్గే రాక

జూలై 4న ఏఐసీసీ అధ్యక్షుడు ఖర